
# పాత్రదానం

స్వప్నసుధ



అభిరామ్ ఆలోచిస్తున్నాడు.

చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం మానవ నైజమా?

అనాధలయాక ఆదుకోవడం మానవత్వమా?

వేశ్య అయాక సంస్కరించడంగొప్పతనమా?

అనాధల్ని, వేశ్యల్ని, విప్లవకారుల్ని ఇంకా చాలా మంది పధవిహీనలను ఈ వ్యవసే ఆవిష్కరిస్తున్నది. ఈ వ్యవస్థ ఈ వ్యక్తులతోనే కూడి ఉన్నది. కాబట్టి వ్యక్తి సంస్కరణ ముందు జరగాలి.

చేతులు కాలని సౌకర్యం ముందే చేస్తే.

అనాధలవక ముందే ఆదుకుంటే.

వేశ్య కాక ముందే ఆమెకు ఆధారం కల్పిస్తే—ఆ వెచ్చించేదేదో ఆదిలోనే వెచ్చిస్తే ఈ స్థితి ఉండదు గదా. ఎవరేమనుకున్నా తనకి మాత్రం ఈ అనాధల్ని ఆదుకోవడం, వేశ్యల్ని సంస్కరించడం మేం ఆదుకుంటాం మేం సంస్కరిస్తాం మీరలా అవండి అన్నట్టు ఉంటుంది. అసలు ఈ వ్యవస్థలో స్వార్థం బుసలుకొడుతుంది, హెచ్చు తక్కువలు పెచ్చరిల్లుతూ ఉన్నప్పుడు ఆ సంస్కరణ తాత్కాలికమే అవుతుంది.

అయితే ఇంతా చేస్తే తానింకా మనుగుడుపుల పెళ్లికొడుకు. మామగారితో తన అభిప్రాయాన్ని ఎలా చెప్పాలో తెలియక ఆలోచిస్తున్నాడు.

రవళి చెప్పి వెళ్లి పోయింది.

అనాధాశ్రమం వాళ్ళు వస్తున్నారట. తన చేతుల మీద వాళ్ళకు విరాళం ఇప్పించాలని మామగారు అనుకుంటున్నారట.

రవళి లక్షలార్జిస్తున్న కంట్రాక్టర్ గారమ్మాయి.

అభిరామ్‌కు తల్లి ఒక్కర్తే ఉంది. మంచి ఉద్యోగముంది. ఉండడానికి చిన్న ఇల్లుంది. మరీ బాదరా బందీ లేదనే రవళిని అభిరామ్‌కు ఇచ్చి చేసారు కంట్రాక్టరుగారు.

"ఇక్కడెందుకండి? క్రిందకు రండి. వాళ్లొచ్చే లోపల టిఫిన్ చేద్దురుగాని." రవళి అంది.

"ఇలా కూర్చో రవళి. నా మనోభిప్రాయాలు కొన్ని చెప్పాలి."

"దేనిమీద, మళ్లీ వాత్సాయనుడి...." అందంగా సిగ్గుపడ్డాడు అభిరామ్. తొలిరాత్రి ముచ్చట్లవి.

"ఛ..ఛ.. అదిగాదు. ఇప్పుడు నా చేతిమీద ఇప్పించడం దేనికి?" సున్నితంగా తప్పుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. తన అభిప్రాయాలు వెల్లడిస్తే తల తిరుగుడు అంటారు కాని అర్థం చేసుకోరు మరి.

"ఎందుకంటే నాన్నగారు ప్రతి సంవత్సరం ఎంతో కొంత ఆ ఆశ్రమానికి ఇస్తారు. ఈ సారి శుభప్రదంగా ఈ ముద్దుల అల్లుడి చేత ఇప్పిద్దామని..."

"అదే ఇప్పిస్తే ఏమవుతుందని?"

"అనాధలను ఆదుకుంటున్న పుణ్యం మనకు దక్కుతుంది. సంఘం మనల్ని ఆశీర్వదిస్తుంది."

"సమాజమే సరిగా నడవలేనప్పుడు సంఘాలు సరిగా నడుస్తాయని నేననుకోను రవళి. ఈ సొమ్మును అనాధలు పేరు అడ్డం పెట్టుకొని ఆ సంఘపు పెద్దలే సగం స్వాహా చేస్తారు. పధకాలు, ప్రణాళికలు నిర్వాహకులకే లాభిస్తాయి కాని అది ఉద్దేశించిన వారికి కాదు. అందుకనే నాకిష్టంలేదు."

చిరాకేసింది రవళికి. మూడు రోజుల ముద్దుల మొగుడు మీద చూపలేకపోయింది.

"ఆలోచించు రవళి. మనలాంటి వాళ్లిచ్చే డబ్బుతో ఈ సంఘాలు ఎలాగోలా నడుస్తాయి అనుకుందాం. ఈ సంఘాలున్నాయి గదా అని- అనాధల్ని చేయడానికి వెనుకాడరు కొందరు. అంటే

పరోక్షంగా అనాథలు ఏర్పడేందుకు సహకరిస్తున్నా-యన్న మాట."

కొంత వింతగా అర్థమయింది రవళికి. మరల పసలేని వాదం అనిపించింది. అందుకే అంది.

"బాగుంది. దానం ధర్మం ఉండొద్దు. ఇచ్చినంత వరకే మన బాధ్యత. ఆ తరువాత ఎవరి పాపం వాళ్లది."

"అది సరి కాదు రవళి. పేరుకోసం కాదు మనం దానం చేయాల్సింది. ప్రాప్తం అనుకుని కాదు చేయాల్సింది. పాత్ర మెరిగి చేయాలి. మనం సద్వినియోగం అవుతుందో లేదో చూడాలి."

"బాగుందండి. మన వ్యాపకాలు మనకు లేవు. ఎందుకొచ్చిన రొద కాని-"

"అలా అనకు రవళి. నువ్వు నా అర్ధాంగివి. నన్నర్థం చేసుకో-ప్లీజ్"

"అంటే దాన ధర్మాలు కూడదంటారు అంతేనా?... అలాగేలెండి. ఎలాగు మన ఇంటికి మనం పోతాం. అప్పుడిలాగే చేద్దాం. ఇది మా వాళ్ల ముచ్చట.... ఈ సారికి కానీయండి." ఆపుకుందా మనుకున్నా రోషాన్ని ఆపుకోలేకపోయింది రవళి.

"అలా నేననను.... మన చుట్టు చాలామంది డబ్బు సృష్టించిన సమస్యలతో సతమతమయే వాళ్లున్నారు. వాళ్లని మనం నేరుగా ఆదరించవచ్చు. వో పెళ్లి కావల్సిన అమ్మాయికి పెళ్లి చేస్తే ఓ వేశ్య తయారు కాకుండా అవొచ్చు. ఓ నిరుద్యోగి నిస్పృహ పొగొడితే ఓ విప్లవకారుడు తయారు కాకుండా ఆపవచ్చు. ఓ బీద విద్యార్థికి సహాయం చేయొచ్చు. ఇలా ఎన్నో-ఎన్నో. లోకమంతా అక్కరలేదు ఇలా మన పరిధిలోని వాళ్లకి సహకరించుకుంటూ పోతే ఈ దళారీ సంఘాల అవసరమే లేదు గదా."

ఆవేశంగా అంతవరకు చెప్పి అసలు రవళి వింటున్నదా? విని ఎలా రియాక్టు అవుతున్నది?అని వెరికించి చూడసాగాడు అభిరామ్.

రవళి అతడి ఆవేశపూరితమైన అభిప్రాయాల గురించి ఆలోచిస్తున్నది. అతడు చెప్పేవన్నీ పచ్చి నిజాలనిఆమె మనసు అంగీకరిస్తున్నది. కాని....

"ఇవన్నీ నాన్న గారికెలా చెప్తామండి... ఇదొక్కసారికి...."

"ఫర్వాలేదమ్మాయ్... అల్లుడు చెప్పిందంతా విన్నాను. చాలా నిజం చెప్పాడు."

"కానీ వాళ్లొచ్చేస్తుంటారునాన్నా."

"రానీయ్ రవళి. మావయ్యగారు మీరంతా విన్నారు గదా- డబ్బు సృష్టించిన సమస్యలతో సత మత మయ్యే వాళ్లు మీమీ పరిచయంలో ఉంటే పిలిపించి వాళ్లకి వాళ్ల ద్వారానే ఇవ్వమందాం."

బయట కారాగిన చప్పుడు వినపడింది. అంటే వాళ్లొచ్చారన్న మాట.

"చూసావా రవళి... అనాథల పేరు మీద ప్రోగయిన డబ్బేగదా వాళ్లకా వాహన యోగం కల్పించింది... నా ఫ్రెండొకడు అనాథాశ్రమంలో పెరిగినవాడే. అక్కడ తిండి, అక్కడి వాతావరణం చెపితే అసహ్యించుకుంటావు... పదండి మామగారు వస్తాను."

"రవళి. నువ్వెళ్లి విమలని- రఘుని- ఆదెమ్మని, రాముని పిల్చుకురా..."

రవళి వెళ్లింది.

సమాజపు పెద్దలు వచ్చి కూర్చున్నారు. రావాల్సిన నలుగురు వచ్చారు.

"చూడండి. ప్రతీ సంవత్సరం మీ ఆశ్రమానికి నేను విరాళం ఇస్తూనే ఉన్నాను. ఈ సారి మా అమ్మాయి వివాహ సందర్భంగా అల్లుడిచేత మీకిప్పిస్తున్న విరాళాన్ని మీచేతుల మీదుగా వీరికి అంద చేయండి."

సభ్యుల మొహాల్లో రంగులు మారాయి.

అభిరామ్ క్రీగంట చూసాడు. అతడొక్కడే వారి భావాల్ని అర్థం చేసుకోగలడు. ఎవరికి లాభించాలో వారికే లాభిస్తున్నప్పుడు దాన్ని ఆశించి దాని మీద బ్రతికే దళారి ఎలా మొహం పెడ్తాడో అలా ఉన్నాయి వాళ్ల మొఖాలు.

"ఈ అమ్మాయి విమల. కట్నాలుఇచ్చుకోలేక పెళ్లికాకుండా ఉండి పోయింది. ఈ అమ్మాయికి కుట్టు వచ్చు. మిషను కోసం ఈ అమ్మాయికి ఓ వేయి రూపాయలు. రఘు అనబడే ఈ నిరుద్యోగ పట్టభద్రునికి తనకి ఇష్టం వచ్చిన చిన్న వ్యాపారం చేసుకోడానికి రెండు వేలు. భర్త బిడ్డలు లేక ముసలిధనంలో కష్టపడి బ్రతుకుతున్న ఈ ఆదెమ్మకు ఓ వేయి. ఈ బీద విద్యార్థి రాముకు ఓ వేయి మీ చేతుల మీదుగా అందించండి."

సభ్యులు ఒకరి మొహాలు ఒకరు చూసు-కున్నారు.

వయసులో ఉన్న అమ్మాయిలు ఆర్థికంగా ఇలా నిలద్రొక్కుకుంటే అనాథలు ఎలా కాగలరు? ఆమె వ్యభిచారో ఏదో అయితే అక్రమ సంతానాన్నైనా అనాథగా తమకు అందిస్తుంది. ఆ నిరుద్యోగి సంఘ విద్రోహకశక్తిగా మారితే సుకరం గదా. ఆ విద్యార్థి చదువుకుంటే ఆలోచించడం నేర్చుకుని తమలాంటి వాళ్లని తుదముట్టిస్తాడు.

"వస్తాం శేషయ్యగారు. ఆ పనేదో మీరే చేసు-కోండి. మీ దాన గుణాల ధర్మగుణం ఏమైంది.? అనాథల్ని ఆదుకోవలసింది పోయి అన్నీ ఉన్న వారిని ఆదుకోవడమా?" ఓ సభ్యుడు కండువా దులిపి అన్నాడు.

"మావయ్యగారి దానగుణం ఎక్కడికి పోలేదండి. పాత్రదానం జరుగుతోంది. అనాథలకు మీరిచ్చే నిర్వచనం ఏమిటో నా కర్థం కాలేదు. అయినా అనాథల్ని ఆదుకోవడానికి మీలాంటి పెద్ద-మనుషులున్నారు.అనాథలు తయారవకుండా మావయ్యలాంటివాళ్లు కృషి చేయాలి. ఇరు వర్గాల ధ్యేయం ఒక్కటి గదా?....లేకుంటే డాక్టర్లు పేషెంట్లను, కాటి కాపరి శవాన్ని, పోలీసులు నేరస్తుల్ని తమ స్వార్థాలకు కోరుకుంటున్నట్లు మీరు అనాథల్ని కోరుకుంటున్నారా?"

అభిరామ్ చురక వేశాడు.

మారు మాట్లాడకుండా ఓ తీక్షణమైన చూపు విసరి వెళ్లి పోయారు వారు.

ఆ చూపుల్లో "ఇలా అయితే మేము బ్రతికేదేలా" అనే దుగ్ధను స్పష్టంగా చూసాడు అభిరామ్.

అలాగే విమల,రఘు, ఆదెమ్మ, రాము, అభిరామ్ ద్వారా డబ్బు అందుకుని చెమర్చిన కళ్లతో నమస్కరిస్తుంటే ఎన్నడూ లేనంత మహదానందం కలగసాగింది శేషయ్యగార్కి. ●

